క్లుప్తంగా

అమ్మవారి హుండీ లెక్కింపు

గురజాల : పట్టణంలో వేంచేసియున్న శ్రీ పాత పాటేశ్వరి అమ్మవారి దేవాలయం హుండీ లెక్కింపును గురువారం నిర్వహించారు. అమ్మవారి హుండీ ఆదాయం 95వేల 46 రూపాయలు వచ్చినట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ ఏఓ గణపతి సురేష్ తెలిపారు. సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ లీలావతి ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ కనకం ఆదినారాయణదత్తు, దేవదాయ శాఖ సిబ్బంది తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు.. మాలధారులకు అన్నదానం



రెంటచింతల: స్థానిక శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవాసమితి మండపంలో గురువారం ఎంపీపీ దాసరి చౌడేశ్వరి దంపతులు వేదపండితులు జిగురు చంద్రశేఖర్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహించి 250 మంది స్వాములకు అన్నదానం చేశారు. మండలంలోని వివిధ గ్రామాలలో మాలధారులకు నవంబర్ 16 నుంచి జనవరి 5 వరకు దాతల సహాయ సహకారాలతో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టినట్లు అయ్యప్ప సేవా సమితి కమిటీ సభ్యులు బొద్దూరి బ్రహ్మారెడ్డి, దేవస్థానం ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ తెలిపారు. గత 18 సంవత్సరాలగా మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు క్వారీ రామారావు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి యువకునికి గాయాలు

కారెంపూడి: బైక్‌పై నుంచి పడి యువకుడు గాయపడిన ఘటన మండలంలోని పేటసన్నెగండ్ల ఎన్ఎస్‌పీ కాల్వ బ్రిడ్జి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. కారెంపూడి శివారు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ కాలనీకి చెందిన కొమెర సంతోషకుమార్ పిడుగురాళ్ల వెళ్లి తిరిగి వస్తుండగా బ్రిడ్జి వద్ద అదుపుతప్పి బైక్‌పై నుంచి పడి గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో రోడ్డుపై పడి ఉన్న అతన్ని గమనించి పేటసన్నెగండ్ల వైఎస్సార్‌సీపీ నాయకుడు గాడిపర్తి పూర్ణయ్య బంధువులకు సమాచారం ఇచ్చారు. బంధువులు అతన్ని నరసరావుపేటలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ అతను చికిత్స పొందుతూ కోలు కుంటున్నాడని తీవ్ర గాయాలేవీ లేవని తెలుస్తోంది.

విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహణ



క్రోసూరు: పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రవి ఆదేశాల మేరకు క్రోసూరు పీహెచ్‌సీ వైద్య అధికారులు డాక్టర్ రమాదేవి, డాక్టర్ అంకమ్మ బాయ్, డాక్టర్ మహమ్మద్ షాద్, డాక్టర్ సిరి చందన ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు దంత ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఫ్లోరోసిస్ వ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించారు. జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనదేశంలో ప్రతి వందమందిలో ముగ్గురు ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. స్వచ్ఛమైన నీరు, జీవన శైలిలో మార్పులు, సమతుల ఆహారం ద్వారా ఫ్లోరోసిస్‌ని నివారించవచ్చన్నారు. పిల్లలు పేస్టు తిన కుండా చూడాలన్నారు. విటమిన్ సి, ఇ, క్యాల్షియం కలిగిన ఆహార పదార్థాలు, పండ్లు వంటివి ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణకు దోహదం చేస్తాయన్నారు.

నిషేధిత ఉత్పత్తులు అమ్మితే కఠిన చర్యలు



మాదలలోని ఓ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై డి.కిశోర్‌బాబు

ముప్పాళ్ళ: నిషేధిత పొగాకు ఉత్పత్తులు, మద్యం అమ్మకాలు జరుపుతూ పట్టుబడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ముప్పాళ్ళ ఎస్సై డి.కిశోర్‌బాబు చెప్పారు. మండలంలోని మాదల, దమ్మాలపాడు గ్రామాల్లో పలు దుకాణాల్లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మత్తు పదార్థాలు అమ్మటం చట్టరీత్యా నేరమని, ప్రజలు కూడా అటువంటి వాటిని వాడటం మంచిది కాదన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నిషేధిత ఉత్పత్తులు అమ్ముతున్నట్లుగా సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి, అమ్మకం దారులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

నగర పంచాయతీ చైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న నాయకులు

గురజాల : ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని నగర పంచాయతీ చైర్మన్ పోలు పవన్మయి వీరారెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సచివాలయం 3,4 పరిధిలో జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్మన్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు వారి గడప వద్దకు చేరుతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులను గుర్తించి వారికి ఫలాలు అందించడం వలన ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావు, అనిల్‌కుమార్, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా కాశీబాబు, మహంకాళీ యశోద దుర్గా, మంచి అంజి బాబు, కందుల సాంబశివరావు, కనకం ఆదినారాయణ దత్తు, బండి రవి కుమార్ తదితరులున్నారు.

అంకితభావంతో సేవలు అందించాలి



పీవీఆర్, అధికారులనుంచి ఎన్నిక నియామక పత్రాన్ని అందుకుంటున్న సంపూర్ణమ్మ



నాగమ్మకు నియామక పత్రాన్ని అందచేస్తున్న ఎన్నికల అధికారి నరేంద్రారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి

రెంటచింతల: మండల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు అంకితభావంతో సేవలు అందించాలని పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికైన పాముల సంపూర్ణమ్మ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. పార్టీని నమ్ముకుని పని చేసిన వారికి ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందచేసి గ్రామాలలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఇప్పటి వరకు వైస్ ఎంపీపీ-2గా కొనసాగిన మంచికల్లు ఎంపీటీసీ మాచర్ల అచ్చమ్మ రాజీనామా చేశారు. ఎన్నికల అధికారి డీఎల్‌డీఓ ఆమెతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం పీవీఆర్, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జెడ్పీటీసీ నవులూరి భాస్కర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు పూజల రామయ్య, మాజీ ఉప సర్పంచ్ ఏరువ ప్రమీలా విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు కట్టమూరి శ్రీనివాసరావు, నాళం చినబాబు తదితరులు సంపూర్ణమ్మను సన్మానించారు. సంపూర్ణమ్మ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని కల్పించిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డికి రుణపడి ఉంటానని పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుంగా కృషిచేసి ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

జెట్టిపాలెం ఉప సర్పంచ్‌గా నాగమ్మ

రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామ నూతన ఉప సర్పంచ్‌గా దావులూరి నాగమ్మను ఏకగ్రీవంగా వార్డు సభ్యులందరూ ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి గురువారం తెలిపారు. ఎన్నికల ఒప్పందంలో భాగంగా ఇప్పటి వరకు ఉప సర్పంచ్‌గా కొనసాగిన కుందురు అనంతలక్ష్మి రాజీనామా చేశారన్నారు. నాగమ్మతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జెడ్పీ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్సిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, పార్టీ నాయకులు మేకపోతుల కృష్ణారెడ్డి, శీలం అంజయ్య, కుందురు పేర్రెడ్డి, మేకపోతుల బూర్రెడ్డి, టౌన్ వీరారెడ్డి తదితరులు నాగమ్మను సన్మానించి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందచేయడానికి, గ్రామంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం



అక్రమ మద్యం, తరలిస్తున్న వ్యక్తితో ఎస్ఈబీ సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్

పిడుగురాళ్ల: అక్రమంగా మద్యం తరలిస్తే సహించేది లేదని ఎస్ఈబీ సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్ అన్నారు. పట్టణంలో ఎస్ఈబీ సీఐ ఎస్.కొండారెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గురజాల ఎస్ఈబీ, పిడుగురాళ్ల ఎస్ఈబీ సిబ్బంది మాచవరం మండలం గోవిందాపురం అమరవీరుల స్థూపం వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిలో ముగ్గురు వ్యక్తులు ఎస్ఈబీ అధికారులను చూసి పారిపోయారని, తోడేటి రమేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. అతని వద్ద 1384 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షలకుపైగా ఉంటుందని ఆయన తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పడవల ద్వారా మద్యం తీసుకొని వచ్చి అక్రమంగా అమ్మకాలు చేస్తే సహించేది లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కొంత మంది వ్యక్తులు ఆంధ్ర ప్రాంతంలోని వ్యక్తులు కలసి ఈ అమ్మకాలు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ ఎస్.కొండారెడ్డి, ఎస్ఈబీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులకు నివాళి



పిడుగురాళ్ల: గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఎస్ఆర్ రంగనాథులు, పాతూరి నాగభూషణం సేవలు మరువలేనివని ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస రావు అన్నారు. పట్టణంలోని గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయంలో ఎస్ఆర్ రంగనాథులు, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొని ఎంతో మందికి ఉపయోగపడే విధంగా చేసిన మహోన్నతమైన వ్యక్తులను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాబోయే తరాలకు వారు చేసిన సేవలను తెలియజేయాల్సిన బాధ్యత మనం దరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి టి.శ్రీనివాసరావు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీఈ యాప్ నమోదుపై శిక్షణ

నకరికల్లు: పంటకోత ప్రయోగాల ద్వారా సగటు దిగుబడి అంచనా వేయవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు బత్తుల శ్రీకృష్ణదేవ రాయలు తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రం-1లో పంటకోత ప్రయోగాలు నిర్వహించి ఫలితాలను సీసీఈ యాప్‌లో నమోదు చేయడంపై గ్రామ వ్యవసాయ సహాయకులకు గురువారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు రసీదులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ కె.దేవదాసు, ఏఎస్ఓ కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పడి పూజా మహోత్సవం



పడి పూజా మహోత్సవంలో వేదికపై సినీ హీరో సుమన్

పిడుగురాళ్లరూరల్: దైవం ఓ మహా అద్భుత శక్తి అని, అనంత కోటికి దేవుడే మూలమని ప్రముఖ సినీహీరో సుమన్ తల్వార్ అన్నారు. మండలంలోని అయ్యప్ప నగర్‌లో వేంచేసియున్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో దివ్య పడి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వీకే సతీష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుమన్‌కు ఆలయ ప్రధానార్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సుమన్ తల్వార్ మాట్లాడుతూ... పవిత్రత, సత్యం , సంస్కారం, సహకారం, సన్మార్గం, మానవత్వం , శ్రమ, ప్రేమ, జ్ఞానం, సంతోషం ఇలా ఎన్నో దైవానికి పర్యాయపదాలు ఉన్నాయని అన్నారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక సుగుణం కనిపిస్తుందని, అలా కనిపించటమే దైవ దర్శనమని ఆయన అన్నారు. ఇతరుల లోపాలు, పాపాలు వెతకటమంటే మనలో లోపాలు, పాపాలను పెంచుకోవటమేనన్నారు. దైవ నామస్మరణ ద్వారానే లబ్ధి చేకూరుతుందని ఆయన అన్నారు. ఇది మానవ జాతికి గొప్ప వరమని, మూల కారకుడైన దైవం పట్ల విశ్వాసం కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథి తిరుమల బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్, డబుల్ హార్స్ మినపగుండ్లు మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ శ్యామ్ ప్రసాద్, ఖుషి ఫర్నిచర్స్ ప్రొప్రైటర్ వెకంటేశ్వర్లు, ఆలయ శాశ్వత ధర్మకర్త గుండా శ్రీనివాసరావు, ఆలయ అధ్యక్షులు అంచూరి శ్రీనివాస్‌రెడ్డి, గోపాలరావు, నాగమణి కంఠ, సిద్ద రామాంజనేయులు, కాకుమాను రమేష్, బండి మల్లారెడ్డి, కట్టమూరి వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్లకు కారెంపూడి విద్యార్థులు



ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం అనంత శివ, ఉపాధ్యాయులు

కారెంపూడి: ఉమ్మడి గుంటూరు జిల్లా సబ్ జూనియర్ బాల బాలికల ఖోఖో జట్లకు కారెంపూడి బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం బి.అనంత శివ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాన్‌వాల్, షాన్‌వాజ్, అక్షయ్ కుమార్, అర్పిత, అశ్వనిలు జిల్లా జట్లకు ఎంపికయ్యారని వారు ఈ నెల 26 నుంచి 28 వరకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో ఆడనున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన పీడీలు శ్రీనివాస రావు, స్వర్ణరాజులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

సహకార వ్యవస్థను బలోపేతం చేస్తున్న సీఎం జగన్

ధూళిపాళ్ల ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార చైర్మన్ నల్లబోతు



సహకార జెండా ఎగురవేస్తున్న నల్లబోతుల శివనారాయణ

సత్తెనపల్లి: సహకార సంఘ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలోపేతం చేస్తున్నారని, నాలుగున్నరేళ్లుగా సహకార సంఘాలు అభివృద్ధి చెందుతున్నాయని ధూళిపాళ్ల ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నల్లబోతు శివ నారాయణ అన్నారు. అఖిల భారత సహకార దినోత్సవం సందర్భంగా ధూళిపాళ్ల ది ఆంధ్రా బ్యాంక్ రైతు సేవా సహకార సంఘ ఆవరణలో గురువారం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో సహకార సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకోవడంతో అన్నదాతలకు ఉపయోగపడుతున్నాయన్నారు. ఎకరానికి రూ.3 లక్షల వరకు రుణాలు ఇచ్చే స్థాయికి తమ సహకార సంఘం ఎదిగిందన్నారు. రైతులు తీసుకున్న రుణాలను వెంటనే చెల్లించి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. జగనన్న పాలనలో సహకార సంఘాలు లాభాల బాటలో నడుస్తున్నాయన్నారు. వీటితో పాటు రైతుల కోసం ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతలకు అండగా నిలబడుతోందన్నారు. ముందుగా సహకార జెండాను ఆయన ఎగురవేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ శివారెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారులు టి.రజిని, ఎస్‌డీఎల్ సీఓ పరిమళ, ఏఆర్ ఎంవీ నరసయ్య, సీనియర్ ఇన్‌స్పెక్టర్, బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు గురువారం అందజేయడం జరిగిందని పశు వైద్య అధికారి డాక్టర్ సి.హెచ్.మల్లయ్య తెలిపారు. మండల పరిధిలోని హస్సానాబాద్ గ్రామంతో పాటు పలు గ్రామాల్లో పాడి రైతులకు కార్డులు అందజేసినట్లు తెలిపారు.

నటనకే వన్నె తెచ్చిన నటుడు సూపర్‌స్టార్ కృష్ణ

సత్తెనపల్లి: తెలుగు చలన చిత్ర సీమలో నటనకే వన్నె తెచ్చిన నటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని ప్రముఖ న్యాయవాది ఎంవీ సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని హోటల్ కార్తిక్ రెసిడెన్సీలో గురువారం నిర్వహించిన కృష్ణ ప్రథమ వర్ధంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. టౌన్ వైడ్ సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చందలూరి రంగారావు, రాజుపాలెం మాజీ జెడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, న్యాయవాదులు ఇ.ఎల్లారెడ్డి, రహీమ్, శివారెడ్డి, సైదా, బచ్చు మనోహర్, గార్లపాటి ప్రభాకర్, అన్నం మురళి శ్రీనివాస్, దేవరశెట్టి రవి, శాంతయ్యలు మాట్లాడారు. కృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ నాయకులు, అభిమానులు ఉన్నారు.

కారెంపూడి వైస్ ఎంపీపీగా సావిత్రి



ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న పీవీఆర్, ప్రిసైడింగ్ ఆఫీసర్ జోసెఫ్‌కుమార్



ఎన్నికకు ముందు సమావేశ మందిరంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు

కారెంపూడి: కారెంపూడి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలుగా కారెంపూడి 2 ఎంపీటీసీ బొమ్మిన అల్లయ్య సావిత్రి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా నియమితులైన డ్వామా పీడీ జి జోసెఫ్‌కుమార్ ఎన్నికను నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బి ఫామ్‌తో బొమ్మిన అల్లయ్య సావిత్రి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 15 మంది ఎంపీటీసీలు ఒక కోఆప్షన్ సభ్యుడు సమావేశానికి హాజరయ్యారు. అందరూ కూడా చేతులెత్తి అల్లయ్యసావిత్రికి ఓటు వేశారు. దీంతో అల్లయ్యసావిత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రిసైడింగ్ ఆఫీసర్ జోసెఫ్‌కుమార్ ధ్రువీకరిస్తూ ప్రకటన చేశారు. అనంతరం ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అల్లయ్యసావిత్రికి బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పీవీఆర్‌ని ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, నూతన వైస్ ఎంపీపీ సావిత్రి ఎంపీటీసీలు ఘనంగా సన్మానించారు. పదవి మార్పిడి ఒప్పందంలో భాగంగా పార్టీ ఆదేశాల మేరకు కారెంపూడి 1 ఎంపీటీసీ గుండెబోయిన అమృతలక్ష్మి ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఎన్నిక ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం నూతన వైస్ ఎంపీపీగా ఎన్నికైన అల్లయ్యసావిత్రికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం



16వ వార్డులోని సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: అభివృద్ధి చేయటమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. పట్టణంలతోని 16వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభిరచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్డును ఏర్పాటు చేయబోతున్నామని ఆయన తెలియజేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే పార్టీ వైఎస్సార్‌సీపీ అని తెలియజేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించటం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందన్నారు. అదేవిధంగా పట్టణంలోని అన్ని వార్డులలో గడప గడపకు మన ప్రభుత్వం సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, కౌన్సిలర్ కత్తెరపు వాసుదేవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొట్టిముక్కల పవన్‌రెడ్డి ఉన్నారు.

సహకార సంఘాల్లో డిజిటల్ సేవలు

-జీడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ రఫీ



కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

మాచవరం: గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల కంప్యూటరీకరణలో భాగంగా అన్ని సొసైటీ బ్యాంకుల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు జీడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ రఫీ అన్నారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా మాచవరం సొసైటీ బ్యాంక్‌లో గురువారం వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సొసైటీ బ్యాంక్‌లో పతాకాన్ని ఆవిష్కరించారు. రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులకు దీటుగా రైతులకు, ఖాతాదారులకు రుణాలు అందజేస్తూ సహకార బ్యాంకులు ప్రజాదరణ పొందుతున్నట్లు తెలిపారు. బ్యాంకులు అందిస్తున్న సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్ పర్సన్ అంబటి కోటేశ్వరరావు, సభ్యులు ఆవుల నరసింహారెడ్డి, అనంగి వెంకటరామయ్య, ఎస్‌డీఎల్‌సీఓ కడప శ్రీనివాసరావు, బ్రాంచి సూపర్‌వైజర్ జక్కుల వెంకయ్య, సీఈఓ గొల్లపల్లి గోపి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ. ఎస్టీ చట్టాలపై అవగాహన అవసరం

సీఐడీ డీఎస్పీ సరిత



ఎస్సీ. ఎస్టీ యువతతో ఏర్పాటు చేసిన సదస్సులో వేదికపై సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత

నకరికల్లు: ఎస్సీ, ఎస్టీ యువత చట్టాలను ఆకళింపు చేసుకొని ఉన్నత చదువులు చదివి జీవితంలో రాణించాలని సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత అన్నారు. స్థానిక కల్యాణమండపంలో ఎంపవర్మెంట్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఆన్ సెన్సిటైజేషన్ ఆన్ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ అగైనెస్ట్ దెం కార్యక్రమం గురువారం నిర్వహించారు. సీఐడీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఎస్సీ, ఎస్టీ యువత పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల హక్కుల ఉల్లంఘనలు జరిగితే చట్టం కాపాడుతుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం మానవులందరికీ సమానహక్కులు కల్పించిందన్నారు. విద్యకు పేదరికం అడ్డుకాకూడదని విద్యలో రాణిస్తే జీవితంలో స్థిరపడడమే కాక సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యకోసం ప్రత్యేక చర్యలు చేపడుతుందని అన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రత్యేక రాయితీలు, ప్రాధాన్యతలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగాన్ని యువత చదవి అర్థం చేసుకొని చట్టాల ద్వారా హక్కులను సాధించాలన్నారు. అనంతరం ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల కోసం అమలు చేస్తున్న పథకాలు, పలు చట్టాలపై యువతీయువకులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. అనంతరం స్థానికులు సీఐడీ ఎస్పీ కేజీవీ సరితను, సీఐడీ, పోలీస్ అధికారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ, సీఐడీ డీఎస్పీ సీహెచ్ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ బి.ప్రేమయ్య, నకరికల్లు ఎస్ఐ ఏ బాలకృష్ణ, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణ చేపట్టాలి



సత్తెనపల్లి: మిరప సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి సీహెచ్ జనని అన్నారు. సత్తెనపల్లి మండలంలోని గుడిపూడి, కంటిపూడి గ్రామాలలో క్షేత్రస్థాయిలో మిరప పంటను గురువారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మిరప పంటలో బొబ్బర్ తెగులు ఆశించడం జరిగిందని, ఈ వైరస్ తెల్ల దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. లేత ఆకులు చిన్నవిగా మారి పైకి ముడుచుకుని పడవ ఆకారంలో మారతాయని, ఈనెలు ఉబ్బి ఉండటంతో పాటు ఆకుల మీద బొబ్బలు ఏర్పడి ముడుచుకుంటాయన్నారు. దీని నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా నివారణ చర్యలు చేపట్టినట్లయితే వైరస్‌ను అరికట్టి పంటను కాపాడుకోవచ్చన్నారు. పొలం గట్ల మీద కలుపు మొక్కలను నిర్మూలించాలన్నారు. వైరస్ సోకిన మొక్కలు ఎప్పటికప్పుడు గమనించి నాశనం చేయాలన్నారు.